ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 27 అక్టోబరు 2024



రేపటి నుంచి పశుగణన

విజయనగరం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పశుగణన కార్యక్రమం సాంకేతిక కారణాలతో 25న ప్రారంభం కాలేదు. తొలి రోజు ఎన్యుమరేటర్లంతా సంబంధిత యాప్‌లో లాగిన్ అవ్వడం.. 26న యాప్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో రాష్ట్ర, జాతీయ పశు సంవర్ధక శాఖ సాంకేతిక సిబ్బంది సరిచేసే పనిలో పడ్డారు. శనివారం కూడా పశుగణన ప్రక్రియ దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కాలేదు. 27న సెలవు నేపథ్యంలో 28 నుంచి యథావిధిగా పశుగణన ప్రక్రియ జరుగుతుందని పశు సంవర్ధకశాఖాధికారులు తెలిపారు.

రాంగ్ కాల్స్



- మనకే తెలియకుండా మోసాలు
- సైబర్ చోరుల వ్యూహానికి చిక్కుతున్న ప్రజలు
- రోజూ జిల్లాలో లెక్కలేనన్ని ఘటనలు
- కొన్ని నెలలుగా జరుగుతున్నా అవగాహన పెరగని వైనం



చీపురుపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చాలామంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇరుక్కుంటున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు ఇలా ఎంతోమంది సైబర్ బాధితులుగా మిగులుతున్నారు. కేసుల పేరుతో సైబర్ కేటుగాళ్లు సామాన్యులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. కొందరు తెలివిగా వ్యవహరించి వారి నుంచి తప్పించుకుంటుంటే, మరికొందరు నకిలీ అరెస్టు ఆర్డర్లకు భయపడి ఎంతో కొంత మొత్తం సమర్పించుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల అధికంగా వెలుగు చూస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ప్రజల్ని కోరుతున్నారు.

● గరివిడికి చెందిన ఓ మహిళ ఎంఎన్‌సీ కంపెనీలో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. సెలవుపై ఉన్న ఆమెకు గత నెల 30న కొత్త నంబర్ నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. 'చెన్నై నుంచి ముంబయికి ఒక అనుమానాస్పద కొరియర్ వచ్చింది. దానిపై మీ ఆధార్ నంబరు ఉందని' అవతలి వ్యక్తి ఫోన్‌లో ఆ ఉద్యోగికి చెప్పాడు. అయితే తాను గరివిడిలో ఉంటున్నానని, పేరున్న కంపెనీలో బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తున్నానని, తనకు నేరపూరిత పనులు చేయాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు. ఆ కొరియర్‌తో గాని, ఆరోపణలతో గాని తనకేం సంబంధమని ఆమె వాదించినా మిగతా 8వ పేజీలో...

గుర్తుతెలియని నంబర్‌తో ఫోన్ చేసి దగ్గర బంధువులా నమ్మబలికి గుట్టు రాబెడుతున్నారు.. మన గురించి కొంత ప్రాథమిక సమాచారం ముందే తెలుసుకుని ఫోన్ చేసి బెదిరింపులకు దిగుతున్నారు.. ఫోన్‌కు లింక్ పంపి దానిపై క్లిక్ చేయాలంటారు. ఆపై ఆన్‌లైన్‌లో అడిగే ప్రశ్నలకు జవాబులిస్తే గిఫ్టులు గెలుచుకుంటారంటూ పక్కదారి పట్టిస్తున్నారు.. ఫోన్‌కు మెసేజ్ పంపి కోట్ల రూపాయలు గెలుచుకున్నారని, వ్యక్తిగత సమాచారం, అడ్రస్ తెలియజేయాలంటూ ట్రాప్ చేస్తున్నారు. ఇలా శతకోటి మోసాలకు అనంతకోటి వ్యూహాలతో ప్రజలను మోసగిస్తున్నారు. ఏది నిజమో తెలుసుకోలేక చాలా మంది అమాయకులు వారి వలకు చిక్కుతున్నారు. కొందరు డబ్బులకు ఆశ పడి పక్కదారి పడుతున్నారు.



అవగాహనతో ఉండాలి

అడ్డగోలుగా డబ్బులు సంపాదించాలన్న దృక్పథం మంచిది కాదు. తెలియని లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయవద్దు. కొత్త వ్యక్తులతో ఓటీపీలు షేర్ చేయకూడదు. సైబర్ కేటుగాళ్లను నమ్మి డబ్బులు పోగొట్టుకుంటే ముందుగా 1930కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలి. బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయితే నగదు వెనక్కి వచ్చే చాన్స్ ఉంటుంది. - ఎస్.రాఘవులు, డీఎస్పీ

ప్రతిరోజూ డబ్బులొస్తాయని..

భోగాపురం, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): లింగాలవలస గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రతిరోజూ డబ్బులొస్తాయని ఆశ పడి ఉన్న డబ్బును కోల్పోయాడు. ఆఖరి నిమిషంలో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రభాకర్ శనివారం తెలిపారు. బాధితుడు ఓ మనీ యాప్ ట్రాప్‌లో పడ్డాడు. ఆ యాప్‌కు ఒకేసారి రూ.18300 చెల్లిస్తే ఏడాదిపాటు ప్రతీ రోజు రూ.660 వస్తుందని ఎవరో చెబితే నిజమేనని నమ్మాడు. కొద్దిరోజులు అలాగే డబ్బులు రావడంతో మరింత పెట్టుబడి పెట్టాలనుకున్నాడు. జూలై 15 నుంచి దఫదఫాలుగా రూ.890450 చెల్లించాడు. ఆ తర్వాత తాను ఊహించిన విధంగా డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. తాజాగా సైబర్ క్రైం పోలీసులకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ప్రభాకర్ తెలిపారు.

ఇంట్లోనే విద్యుత్ తయారీ

- రాయితీపై సోలార్ ప్లాంట్లు
- సూర్యఘర్ పథకం ద్వారా అవకాశం
- మిగులు విద్యుత్ విక్రయానికి చర్యలు
- వచ్చే నెల నుంచి మంజూరు ప్రక్రియ



రాజాం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేయాలనుకున్న వారికి శుభవార్త. ఇంటి ప్రాంగణంతో పాటు పైకప్పుపై సైతం సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాయితీలు ప్రకటించాయి. కేంద్ర ప్రభుత్వం పీఎం సుర్యఘర్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. భారీగా రాయితీలు ప్రకటించింది. మూడు కిలోవాట్ల పథకానికి సంబంధించి రూ.78 వేల వరకూ సాయం అందించనుంది. ఈ ప్లాంటు ఏర్పాటుచేసుకుంటే ఇంటి అవసరాలకు పోను విద్యుత్ మిగిలితే అమ్ముకోవచ్చు. డిస్కంలే కొనుగోలు చేసి ఆ నగదును లబ్ధిదారుడికి అందిస్తాయి. అయితే మన రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా అందించేం దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఎస్సీ,ఎస్టీ లబ్ధిదారులు ఎంతమంది ఉన్నారు? వారిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంతమంది ఆసక్తిచూపుతున్నారు? వంటి వివరాలను సేకరించే పనిలో ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది నిమగ్నమయ్యారు. బృందాలుగా సర్వే చేస్తున్నారు.

మిగులు విద్యుత్ కొనుగోలు

ఎవరైనా సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుచేసుకొని.. వారు వాడిన విద్యుత్ కంటే ఎక్కువ ఉత్పత్తి జరిగితే అది వారికే లాభం. ఎందుకంటే మిగులు విద్యుత్‌ను ప్రభుత్వమే తిరిగి కొనుగోలుచేస్తుంది. డిస్కంలే ఆ మిగులు విద్యుత్‌ను కొనుగోలుచేసేలా చర్యలు చేపట్టనున్నారు. ఒకసారి సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుంటే 25 సంవత్సరాల పాటు నిరంతరాయంగా వాడుకోవచ్చు. ఒక కిలోవాట్ ప్లాంట్ ఏర్పాటుచేసుకునేందుకు దాదాపు రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షల వరకూ ఖర్చవుతుంది. అయితే దీనికి రూ.30 వేలవరకూ ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. రెండు కిలోవాట్ల ప్లాంట్ అయితే రూ.లక్ష నుంచి రూ.1.45 లక్షల ఖర్చు అవుతుంది. రూ.60 వేల వరకూ సబ్సిడీ అందిస్తారు. మూడు కిలోవాట్లు అయితే రూ.1.80 లక్షల నుంచి రూ.2.20 లక్షల ఖర్చు అవుతుంది. రూ.90 వేల వరకూ రాయితీ పొందవచ్చు. ఇంటి అవసరాలకు విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే.. చాలా వరకూ మిగలనుంది. దానిని డిస్కంలకు అమ్మి కొంత ప్రయోజనం కూడా పొందవచ్చు.

● సోలార్ ప్లాంట్ల ఏర్పాటుతో లబ్ధిదారునితో పాటు ప్రభుత్వానికీ ప్రయోజనమే. అయితే ప్రభుత్వానికి ప్రస్తుతం ఖర్చు పెరిగినా దీర్ఘకాలంలో విద్యుత్ కొనుగోలు భారం తగ్గనుంది. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 50685 మంది ఉన్నారు. అటు పార్వతీపురం మన్యం జిల్లాలో 73,328 మంది ఉన్నారు. సర్వే పూర్తయ్యాక లబ్ధిదారుల ఎంపిక ప్రారంభం కానుంది.

జిల్లా వ్యాప్తంగా సర్వే

జిల్లాలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి సర్వే జరుగుతోంది. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారు. ఎవరైనా సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొస్తే సూర్యఘర్ పథకం కింద మంజూరు చేస్తాం. రాయితీ సైతం అందిస్తాం. మిగులు విద్యుత్‌ను డిస్కంలే కొనుగోలు చేస్తాయి. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనిపై విధి విధానాలు రావాల్సి ఉంది.

- లక్ష్మణరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ, విజయనగరం



ఇంటి పైకప్పులో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లు



వృద్ధురాలికి టీడీపీ సభ్యత్వం ఇస్తున్న ఎమ్మెల్యే అదితి

టీడీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం

- తొలి సారిగా శాశ్వత సభ్యత్వ ప్రక్రియ
- క్రియాశీలక సభ్యత్వం యథాతథం
- ప్రమాద బీమా వర్తింపు
- జనవరి 18 నుంచి కొత్త కమిటీలు

విజయనగరం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఫోన్ పే ద్వారా.. మొబైల్ నుంచే ఎవరి సభ్యత్వం వారు తీసుకునేలా ఏర్పాట్లు చేశారు.. క్షేత్రస్థాయిలో వార్డు ఇన్‌చార్జిలు, గ్రామ టీడీపీ ఇన్‌చార్జిలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. ఎమ్మెల్యే లేదా ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి సమాచారం ఇవ్వనున్నారు. టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు ఆన్‌లైన్‌లో తన సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శనివారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు.

గజపతినగరం నియోజకవర్గానికి సంబంధించి శనివారం గంట్యాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. అదే విధంగా సభ్యత్వ నమోదు ప్రక్రియను పరిశీలించేందుకు వెళ్లిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున కూడా సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో ఈ ఏడాది శాశ్వత సభ్యత్వం అనే ఆప్షన్ ఇచ్చారు. శాశ్వత సభ్యత్వం పొందే వారు రూ.1 లక్ష చెల్లించాల్సి ఉంటుంది. క్రియాశీలక సభ్యత్వం కింద రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. గతంలో ప్రమాద బీమా రూ.2 లక్షలు ఉండగా, రూ.5 లక్షలకు పెంచారు.

క్షేత్రస్థాయి కమిటీలు రద్దు?

టీడీపీకి గ్రామ, వార్డు, డివిజన్ కమిటీలు, ఆ పైన మండల, నగర కమిటీలు మిగతా 8వ పేజీలో...

సీనియర్లను ప్రోత్సహిస్తూ యువతకు ప్రాధాన్యమివ్వాలి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



గంట్యాడ, అక్టోబరు26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులను ప్రోత్సహిస్తూ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జగ్గాపురం గ్రామంలో పార్టీ సభ్యత్వం నమోదును ఆయన శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. గజపతినగరం నియోజకవర్గంలో లక్ష మందికి టీడీపీ సభ్యత్వం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జగ్గాపురం గ్రామంలో శాశ్వత సభ్యత్వం తీసుకున్నట్లు మంత్రి ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ధర ఒకేలా ఉండాలి

● టన్నుకు రూ.150 తగ్గింపు ● సీనరేజీ లేదు: కలెక్టర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం, కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా అంతా ఇసుక తవ్వకం ధర ఒకేలా ఉండేలా చూడాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఇసుక సరఫరా జిల్లా కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టాక్ పాయింట్ వద్ద ఇసుక తవ్వకపు ధర టన్నుకు రూ.425 ఉందని, నేరుగా రీచ్ వద్ద తీసుకునే వారికి రూ.150 చెల్లిస్తే చాలని అన్నారు. దీనికి ఎటువంటి సీనరేజీ లేదని, రవాణా చార్జీలను మాత్రమే లబ్ధిదారులు చెల్లించుకోవాలని కలెక్టర్ తెలిపారు. బొబ్బిలి, కొత్తవలస, డెంకాడ స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూంతో కనెక్ట్ చేయాలని ఆదేశించారు. తూనిక యంత్రాల వద్ద నిఘా ఉంచాలని చెప్పారు. సమావేశంలో జేసీ సేతుమాధవన్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, రవాణా ఉప కమిషనర్ మణికుమార్, మైన్స్ డీడీ మోహన్ రావు, బొబ్బిలి, చీపురుపల్లి ఆర్‌డీవోలు పాల్గొన్నారు.

● జిల్లాలో స్త్రీ, పురుష జనన రేషియో తగ్గిందని, అన్ని స్కానింగ్ కేంద్రాలను పోలీసు, ఆర్‌డీవోలు కలిసి తనిఖీ చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. 1000 మంది మగ శిశువులకు, 918 మంది ఆడ శిశువులు నమోదు కావడంపై అనుమానం వ్యక్తం చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీ చేసి నివేదికలు అందించాలన్నారు.

ఈ వీణకు కలపేదీ?

- పనస చెట్లు పెంచాలని పవన్ కల్యాణ్ ఆదేశం
- ఇప్పట్లో అందుబాటులోకి రావని కళాకారుల ఆవేదన
- పనస కలప డిపో ఏర్పాటు చేయాలని అభ్యర్థన

6లో



'తెర'మరుగు!

- జిల్లాలో మూత పడుతున్న సినిమా థియేటర్లు
- వీధిన పడుతున్న కార్మికులు
- నిర్వహణ భారం అంటున్న యాజమాన్యాలు
- వినోదానికి దూరమవుతున్న ప్రేక్షకులు



6లో

ఇక 'స్మార్ట్'గా..

- విద్యుత్ శాఖలో సంస్కరణలు
- ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్‌మీటర్లు
- అనంతరం వాణిజ్య, గృహ వినియోగదారులకు ఏర్పాటు
- త్వరలో ప్రీపెయిడ్ ప్లాన్ అమలయ్యే అవకాశం
- ముందస్తుగా రీచార్జ్ చేసుకునే అవకాశం

6లో



డీఆర్‌వోగా శ్రీనివాసమూర్తి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారిగా ఎస్.శ్రీనివాసమూర్తి శనివారం కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో విజయనగరం ఆర్‌డీవోగా, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారిగా, సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా పనిచేశారు. డీఆర్‌వోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసమూర్తి కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత పైడితల్లి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసమూర్తి

ఈ వీణకు కలపేదీ?

- పనస చెట్లు పెంచాలని పవన్ కల్యాణ్ ఆదేశం
- ఇప్పట్లో అందుబాటులోకి రావని కళాకారుల ఆవేదన
- పనస కలప డిపో ఏర్పాటు చేయాలని అభ్యర్థన





ఒడిశాలో లభ్యం...

ఒడిశా ప్రాంతంలో పనస చెట్లు విస్తారంగా ఉన్నాయి. అక్కడి నుంచి కలపను దిగుమతి చేసుకొని స్థానికంగా డిపోను ఏర్పాటు చేయాలని తాము అధికారులను, నాయకులను కోరామని... అలా చేస్తే తమకు కలప కొరత తీరుతుందని కళాకారులు చెబుతున్నారు.

బొబ్బిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన బొబ్బిలి వీణల తయారీకి పనస చెట్ల కలపను వినియోగిస్తుంటారు. ఈ కళాకారుల కోసం గొల్లపల్లి గ్రామంలో హస్తకళల అభివృద్ధి సంస్థ (సీడీసీ) ఆధ్వర్యంలో సుమారు పాతికేళ్ల క్రితం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి కళాకారులంతా పనస కలపను అందుబాటులో ఉంచాలని అధికారులను కోరుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారాయి. అధికారులు మారుతున్నారు. దేశ విదేశాల నుంచి ఎందరెందరో వస్తున్నారు. చిట్టి పొట్టి వీణలతో పాటు పెద్ద వీణలు (సంగీతం పలికే వీణలను) చూసి మురిసి పోతున్నారు. వాటిని తయారు చేస్తున్న కళాకారులను ప్రశంసించి వెళ్లిపోతున్నారు. కానీ వీణల తయారీకి అవసరమైన పనస కలపను తమకు అందుబాటులో ఉంచాలని ఏళ్ల తరబడి కోరుతున్నా ఫలితం లేకపోతోంది.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందనతో...

తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలలో పనస మొక్కలను విరివిగా పెంచాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో ఏటికొప్పాక బొమ్మల తయారీకి తెల్లపొణి, అంకుడు మొక్కలు, బొబ్బిలి వీణల తయారీకి పనస మొక్కలను విస్తృతంగా నాటాలని ఉన్నతాధికారులు ఉపాధి హామీ అధికారులకు సర్క్యులర్లు జారీ చేశారు. పనస మొక్కలను ఇప్పటికిప్పుడు నాటితే... దాని కలప అందు బాటులోకి రావాలంటే కనీసం 40 ఏళ్లు పడుతుంది. ప్రస్తుత వీణల తయారీ కళాకారులకు ఈ కలప అందుతుందా? అనేది ప్రశ్నార్థకం. కలప కొరత కారణంగా ఇప్పుడు వీణల తయారీకి ఇబ్బందులు తప్పడం లేదు.

పనస చెట్లు పెంచాలని ఆదేశాలు..

ఉపాధి హామీ పథకంలో పనస మొక్కలను పెద్దసంఖ్యలో పెంచాలని ఆదేశాలొచ్చాయి. వీణల తయారీదారులకు పనస కలప కొరతను తీర్చేందుకు ఈ ప్రతిపాదన చేశారు. పూర్తి స్థాయి మార్గదర్శకాలు వెలువడిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.

-లక్ష్మీపతిరాజు, ఉపాధి పథకం ఏపీఓ, బొబ్బిలి

పనస కలప డిపో అవసరం..

ఎన్నో ఏళ్ల నుంచి మేం పనస కలప డిపో ఏర్పాటు చేయాలని కోరుతున్నాం. ఇప్పుడు మొక్కలు నాటితే అవి మాకు అందడం కల్ల. మా తరువాతి తరాల వారికి అందుతాయి. ఒడిశాలో పనస సంపద చాలా ఎక్కువగా ఉంటుంది. స్థానికంగా డిపోను ఏర్పాటు చేసి... ముడిసరుకును అందుబాటులో ఉంచితేనే మాకు ప్రయోజనం. పనస మొక్కల పెంపకం ప్రతిపాదనను స్వాగతిస్తున్నాం. అదే సమయంలో కలప డిపోను కూడా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేయాలి. 40, 50 ఏళ్ల వయస్సు కలిగిన చెట్ల బెరడును రెండు అంగుళాల వరకు తొలగిస్తే గానీ మాకు ఆ కలప వినియోగానికి పనికిరాదు. పనసకు ప్రత్యామ్నాయం సంపంగి. కానీ సంపంగి చెట్లు చాలా అరుదు. అవి ఖరీదైనవి.

-సర్వసిద్ధి రామకృష్ణ, వీణల కేంద్రం ఇన్‌చార్జి, బొబ్బిలి



డాగ్ షోను తిలకిస్తున్న విద్యార్థులు



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆకట్టుకున్న ఓపెన్‌హౌస్

- ఆయుధాలపై అవగాహన
- డాగ్‌స్క్వాడ్ విన్యాసాలు
- ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు

బొబ్బిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శనివారం బొబ్బిలి పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్‌కు విశేష స్పందన లభించింది. పట్టణానికి చెందిన వివిధ విద్యా సంస్థల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి ఓపెన్ హౌస్‌ను ఆసక్తిగా తిలకించారు. ముఖ్యంగా డాగ్ షో బాగా ఆకట్టుకుంది. బాంబులను గుర్తించే ప్రక్రియను డాగ్ స్వయంగా చూపించడంతో విద్యార్థులంతా కేరింతలు కొట్టారు. పోలీసులు ఉపయోగించే అన్ని రకాల ఆయుధాలను ప్రదర్శించారు. వాటిని వినియోగించే తీరు, వాటి సామర్థ్యం తదితర అంశాలపై పోలీసు సిబ్బంది విద్యార్థులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. పోలీసు స్టేషన్‌లో రిసెప్షన్, లాకప్ రూమ్, కమ్యూనికేషన్ సిస్టమ్, కేసులను ఏవిధంగా దర్యాప్తు చేస్తారు? ట్రాఫిక్ రూల్స్, తదితర అంశాలన్నిటినీ వివరించారు. మద్యం తాగి వాహనాలను నడిపే వారిని గుర్తించే విధానాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ భావజాలాన్ని సమాజంలో వ్యాప్తి చేయడానికి ఈ తరహా కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, మహిళా పోలీసులు, అభ్యుదయ హైస్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా శారద, అభిమాని ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యసేవలు

- రాజాం సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిబాబు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



రాజాం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజాం సామాజిక ఆసుపత్రిలో రోగులకు కార్పొరేట్ తరహాలో అన్నిరకాల వైద్య సేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ డా.కరణం హరిబాబు తెలిపారు. 24 గంటలూ రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.

- ప్రశ్న: డయేరియా, విషజ్వరాల కాలం.. వీటిని ఎదుర్కొనేందుకు తీసుకున్న ముందస్తు చర్యలేమిటి?
- జవాబు: బాధితులకు అవసరమైన అన్నిరకాల మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. తీవ్రతను బట్టి వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలకు కావాల్సిన యాంటిబయోటిక్స్, ఇతర మందులు పుష్కలంగా ఉన్నాయి.
- ప్ర: కుక్క, పాముకాటు వ్యాక్సిన్ల పరిస్థితి ఏమిటి?
- జ: కుక్క, పాముకాటుతో ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని పెద్దసంఖ్యలో వ్యాక్సిన్లు తెప్పించాం. ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం.
- ప్ర: ఆసుపత్రిలో ప్రసవాల పరిస్థితి ఏమిటి?
- జ: గత కొంతకాలంగా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. గతానికి భిన్నంగా తల్లీపిల్లలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. సుమారు పది మండలాల నుంచి రోగులు ఆసుపత్రికి వచ్చి పోతున్నారు.
- ప్ర! రోగులకు ఇచ్చే ఆహారంపై విమర్శలు ఉన్నాయి. దీనిపై మీరు తీసుకుంటున్న చర్యలేంటి?
- జ: అదంతా గతం. సూపరింటెండెంట్‌గా నేను బాధ్యతలు చేపట్టాక పాత మెనూ మార్చేశాను. రోజూ ఉదయం పులిహోరకు బదులు పూరీ, దోసెలు, ఇడ్లీ ఇన్ పేషెంట్లకు అందజేస్తున్నాం. రోజుకొకరు చొప్పున ఆసుపత్రి సిబ్బంది టిఫిన్, భోజనం రుచి చూసి సంతృప్తి చెందాకనే రోగులకు అందించేలా చర్యలు ప్రారంభించాం.
- ప్ర: ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సేవలేంటి?
- జ: తల్లీపిల్లలు, ఎనస్థీషియా, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, పాథాలజీ, జనరల్ ఫిజీషియన్, డెంటల్, ఐ కేర్, ఇ.ఎన్.టి. తదితర విభాగాలలో అనుభవజ్ఞులైన వైద్యులు రోగులకు సేవలందిస్తున్నారు. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ సదుపాయం కూడా ఉంది. డెర్మటాలజీ పోస్ట్ మంజూరైనా వైద్యుడిని నియమించలేదు.

ఇక స్మార్ట్‌గా..



- విద్యుత్ శాఖలో సంస్కరణలు
- ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు
- అనంతరం వాణిజ్య, గృహ వినియోగదారులకు ఏర్పాటు
- త్వరలో ప్రీపెయిడ్ ప్లాన్ అమలయ్యే అవకాశం
- ముందస్తుగా రీచార్జి చేసుకునే అవకాశం

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ జిల్లాలో మొదలైంది. వీటిని తొలి దశలో ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తంగా 7,500 ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా... ఇప్పటి వరకూ 2,259 స్మార్ట్ మీటర్లను అమర్చారు. ఆ తరువాత వాణిజ్య, గృహ వినియోగదారులకు అమర్చుతామని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. గృహ వినియోగదారుల్లో 300 యూనిట్లు పైబడిన వారికి మాత్రమే స్మార్ట్‌మీటర్లు అమర్చుతామన్నారు. జిల్లాలో వాణిజ్య వినియోగదారులు (కమర్షియల్) సుమారు లక్ష మంది ఉండగా... గృహ వినియోగదారులు (డొమెస్టిక్), 5,89,988 మంది ఉన్నారు.

ఇవి ఎందుకంటే...

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఈ స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారు. వీటి వల్ల ఎక్కడ? ఎంత? విద్యుత్ వినియోగిస్తున్నదీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుస్తుంది. అదే విధంగా ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ సరఫరా ఉందా? లేదా? ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతున్న లోడ్‌వంటి అంశాలన్నీ విద్యుత్ సంస్థల అధికారులకు తెలుస్తాయి. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసుకునే వారు దానిని మొబైల్‌లాగా ముందుగా డబ్బులు కట్టి రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెల 10 నుంచి 15 రోజుల వ్యవధిలో బిల్లు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్లు వచ్చాక అది కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తుందో? సగటున అంచనా వేసి... ఆ మొత్తాన్ని ముందుగానే చెల్లించి మీటరును రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ఒకసారి అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే... మొత్తం ముందుగానే అయిపోతుంది. అటువంటి సమయంలో వినియోగదారుల మొబైల్స్‌కి మేసేజ్ పంపిస్తారు. వినియోగించిన విద్యుత్... రీచార్జి చేసిన మొత్తం... ఇంకా ఎంత మొత్తం రీచార్జి చేసుకోవాలో తెలియజేస్తారు. దీని వల్ల విద్యుత్ పంపిణీ సంస్థలకు వంద శాతం బిల్లులు అందుతాయి. విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల నుంచి బయట పడడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

బకాయిల బెడద ఉండకూడదని..

ప్రస్తుతం విద్యుత్ పంపిణీ సంస్థలకు వాణిజ్య, గృహ వినియోగదారుల నుంచి బిల్లుల వసూలులో పెద్దగా సమస్యలు లేవు. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలే బిల్లులు ఏళ్ల తరబడి కట్టడం లేదు. బకాయిలు కోట్ల రూపాయల్లో ఉంటున్నా... వాటిని రాబట్టలేకపోతున్నాయి. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే, బకాయిల బెడద ఉండదని విద్యుత్ అధికారులు భావిస్తున్నారు. సంబంధిత సంస్థలు కూడా ముందుగానే వారి మీటర్లకు రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. అందుకే ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ పొదుపే లక్ష్యం..

ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ పొదుపు సాధించవచ్చునని... తద్వారా నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు సరఫరా చేయడానికి అవకాశాలు ఏర్పడతాయని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలోనే ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన రాగా... వినియోగదారుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో కొంత జాప్యం జరిగింది.

తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాలకే..

ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నాం. అనంతరం వ్యాపార సంస్థలకు, గృహ విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తాం. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లుల పెరుగుదల ఉండదు. ఇది కేవలం అపోహ మాత్రమే. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ పొదుపు సాధ్యమవుతుంది.

-ఎం.లక్ష్మణరావు, ఎస్‌ఈ, ఏపీఈపీడీసీఎల్, విజయనగరం

తెర మరుగు!



- రాజాం పట్టణంలోని సీతాలక్ష్మి థియేటర్ ఇది. వారపు సంత సమీపంలోని ఈ థియేటర్ ఎంతో ప్రాముఖ్యమైనది. కానీ నష్టాలు వస్తున్నాయన్న కారణంతో సినిమా ప్రదర్శనలను నిలిపివేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు పెద్దగా ఆసక్తి చూపకపోవడం... నిర్వహణ భారం కావడంతో మూసివేసినట్టు యాజమాన్యం చెబుతోంది.

- జిల్లాలో మూత పడుతున్న సినిమా థియేటర్లు
- వీధిన పడుతున్న కార్మికులు
- నిర్వహణ భారం అంటున్న యాజమాన్యాలు
- వినోదానికి దూరమవుతున్న ప్రేక్షకులు



- రాజాం పట్టణంలో వేదలక్ష్మి థియేటర్ ఇది. గతంలో ఈ ప్రాంతంలో ఈ థియేటర్ ఎంతో ప్రసిద్ధి చెందింది. 90వ దశకంలో ఎన్నో హిట్ చిత్రాలు ఈ థియేటర్‌లో ప్రదర్శితమయ్యాయి. కానీ ఆ తరువాత నడపలేక యాజమాన్యం థియేటర్‌ను నిలిపివేసింది. దీనిపై ఆధారపడిన 20 కుటుంబాలు వీధిన పడ్డాయి.



- రాజాం డోలపేట రోడ్డులో శ్రీనివాస థియేటర్ ఉండేది. కానీ నిర్వహణ భారం కావడంతో యాజమాన్యం ఇలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టింది. పెరిగిన నిర్వహణ భారం... థియేటర్లకు ఆదరణ తగ్గడంతో కొద్దిరోజుల పాటు నష్టాల్లో నడిపిన యాజమాన్యం పూర్తిగా థియేటర్‌ను తొలగించింది. దాని స్థానంలో ఇలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టింది.



- రాజాం పట్టణంలోని పాలకొండ రోడ్డులో వాసవి థియేటర్ ఇది. తొలి ఏసీ డీటీఎస్ థియేటర్. కానీ ఈ థియేటర్‌ను కూడా నిర్వహించలేక మూసివేశారు. దీంతో పదుల సంఖ్యలో కార్మికులు వీధిన పడ్డారు. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు వెళ్లిపోయారు.

రాజాం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన సినిమా థియేటర్లు వైభవాన్ని కోల్పోతున్నాయి. ఒక్క రాజాంలోనే కొద్ది సంవత్సరాల్లోనే నాలుగు థియేటర్లు మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా చాలావరకూ థియేటర్లు మూతపడగా.. మరి కొన్ని మూత పడేందుకు సిద్ధంగా ఉన్నాయి. నిత్యం ప్రేక్షకుల తో కళకళలాడే థియేటర్లు... ఇప్పుడు వెలవెలబోతున్నాయి. నిర్వహణ భారంతో యాజమాన్యాలు మూసి వేస్తున్నాయి. వాటిపై ఆధారపడే కార్మికులు వీధిన పడుతున్నారు. ఉపాధికి దూరమవు తున్నారు. జిల్లా వ్యాప్తంగా 70 థియేటర్లు ఉండేవి. కానీ సుమారు 30 థియేటర్ల వరకూ మూసే శారు.. మిగతావి రైస్‌మిల్లులు, కల్యాణ మండపాలు, వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. కరోనా తరువాత సినిమా థియేటర్ల యాజమాన్యాలకు కోలుకోలేని దెబ్బ తగిలింది. దాదాపు ఏడాది పాటు పూర్తిగా మూతపడ్డాయి. తరువాత ఆంక్షలతో అనుమతించినా చాలావరకూ తెరచుకోలేదు. వైసీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ టిక్కెట్ విధానాన్ని తెరపైకి తేవడం... విద్యుత్ చార్జీల భారం... సిబ్బందికి జీతాలు... నిర్వహణ ఖర్చులు... కూడా రాని దుస్థితి ఎదురైందని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

● థియేటర్‌లో సిబ్బంది ఇలా...

ఒక్కో థియేటర్‌లో మేనేజర్, సూపర్‌వైజర్, అసోసియేట్స్, హౌస్ కీపింగ్, స్కావెంజర్ తదితర సిబ్బంది 15 నుంచి 25 మంది వరకూ ఉంటారు. పెద్ద నగరాల్లో అయితే వీరికి జీతాలు రూ.3 లక్షల వరకూ చెల్లించాల్సి ఉంటుంది. పట్టణాలు, మండల కేంద్రాలైతే రూ.1.50 లక్షలు జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. థియేటర్‌కు నెలకు రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దాదాపు అన్నీ ఏసీ థియేటర్లు కావడంతో విద్యుత్ వినియోగం అదనమైంది. సాధారణ రోజుల కంటే వేసవిలో డబుల్ చార్జీలు వస్తుంటాయి. ఇవన్నీ భరించలేని యాజమాన్యాలు.. డిస్ట్రిబ్యూటర్లు.. నిర్మాతలకు థియేటర్లను అద్దెకిస్తున్నాయి. జిల్లాలో థియేటర్లను ఎక్కువ శాతం నేరుగా డిస్ట్రిబ్యూటర్లే లీజుకు తీసుకొని నడుపుతున్నారు.

● వైసీపీ విధానాలతో నష్టం..

వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన నూతన విధానంతో టిక్కెట్లు ధరలు గణనీయంగా తగ్గాయి. దీంతో థియేటర్ల ఆదాయం పడిపోయింది. గతంలోలాగా పెద్ద హీరోల చిత్రాలు కూడా ఆశించిన స్థాయిలో రావడం లేదు. దీంతో ప్రేక్షకులు కూడా థియేటర్ల వైపు చూడడం లేదు. ఒక్కో షోకు పదుల సంఖ్యలో మా త్రమే ప్రేక్షకులు వస్తున్నారు. టిక్కెట్ల రూపంలో వచ్చిన ఆదాయం విద్యుత్ చార్జీలకు కూడా చాలడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మొస్తరు పట్టణాల్లో మాత్రమే థియేటర్లు నడిచే అవకాశాలున్నా యి. మిగతాచోట్ల మాత్రం యాజమాన్యాలు థియేటర్లు మూసి ప్రత్యామ్నాయ వ్యాపారాలకు వినియోగించుకోవ డానికి ప్రయత్నిస్తున్నాయి. దీంతో థియేటర్‌పై ఆధారప డిన వందలాది కార్మిక కుటుంబాలకు ఉపాధి..ప్రేక్షకులకు వినోదం దూరమైనట్టే. ఇలా కాకుండా సామాన్య ప్రేక్షకులకు అందుబాటులో టిక్కెట్ల ధరలు ఉంచుతూనే.. థియేటర్ యాజమాన్యాలకు తగిన ప్రోత్సాహకాలు... రాయితీలు అందిస్తే సినిమా థియేటర్లకు మంచి రోజులు వచ్చే అవకాశాలు ఉన్నాయని యాజమాన్యాలు చెబుతున్నాయి.

1,200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తవలస/విజయనగరం క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముసిరాంలో వంటసారా తయారీ చేస్తున్న స్థావరాలపై శనివారం దాడులను నిర్వహించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇంద్రా దేవి తెలిపారు. ఈ మేరకు 1200 లీటర్ల బెల్లం ఊటతో పాటు 10 లీటర్లు సారాను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు చెప్పారు. నిందితులను గుర్తించి పట్టుకుంటామని తెలిపారు. డ్రమ్ములున వంట సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దాడుల్లో ఎస్ఐ ఎస్‌వీ రామారావు, హెడ్ కానిస్టేబుల్ కె.రాంబాబు పాల్గొన్నారు.

వీవీఆర్‌పేటలో వెయ్యి లీటర్లు ..

వంగర అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవీఆర్‌పేటలో శనివారం సాయంత్రం 1000 లీటర్లు బెల్లం ఊటలను పోలీసులు ధ్వంసం చేశారు. గ్రామంలో సారా తయారీకి పలువురు సిద్ధమవుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ షేక్ శంకర్ సిబ్బంది దాడిచేశారు. సారా తయారీకి సిద్ధం గా ఉంచిన వెయ్యిలీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేశారు.

మూడు కేజీల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విజయ నగరంలోని ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేసినట్లు సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.ఎస్ఐ కథనం మేరకు..పోలీసులకు శనివారం అందిన సమాచారం మేరకు క్రైం ఎస్ఐ సురేంద్ర నాయుడు సిబ్బంది, గూడ్స్ షెడ్ సమీపంలో వాహనాలు తనిఖీచేశారు. నగరంలోని బుంగ వీధికి చెందిన మంగళగిరి గణేష్‌తో పాటు మరో బాలుడు ద్విచక్ర వాహనంతో వస్తున్నారు. ఆ వాహనం ఆపి తనిఖీలు చేపట్టి మూడుకేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేయగా ఒడిశాలోని రాయగడ్ నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు.వీరి వద్దనుంచి గంజాయితో పాటు, రూ.220 నగదును స్వాధీనం చేసుకుని కేసునమోదుచేశారు. గణేష్‌ను రిమాండ్‌కు, బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. జువైనల్‌పై ఇదే పోలీస్ స్టేషన్‌పై స్నాచింగ్ కేసు, గణేష్‌పై మూడు ద్విచక్రవాహన దొంగతనం కేసులు, మొబైల్ స్నాచింగ్ కేసు ఒన్‌టౌన్‌లో నమోదయ్యాయి. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ సురేంద్రనాయుడు,హెచ్‌సీ అచ్చిరాజు, పీసీలు, శివకుమార్, గౌరీశంకర్‌ను సీఐ అభినందించారు.

కోడిశలో లగేజ్ ఆటో దగ్ధం

రేగిడి, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిశలో శుక్రవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన లెంక నవీన్ లగేజ్ ఆటోను శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేశారు. ఆరుబయట ఉన్న ఆటోకు అందరు నిద్రస్తుండగా నిప్పుపెట్టి పరారయ్యారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ నీలావతి కేసు నమోదుచేశారు. ఐదుగురు అనుమానితులపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడు టీడీపీ మద్దతుదారుడు కాగా, ఇది ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తులుచేసిన పనిగా టీడీపీ వర్గీయులు ఆరోపిస్తున్నారు.

అద్దె బకాయిలు చెల్లించని షాపుల సీజ్

బొబ్బిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలో అద్దె బకాయిలను చెల్లించని షాపుల నిర్వాహకులపై అధికారులు కొరడా ఝుళిపించారు. మూడులక్షల రూపాయలకుపైగా అద్దె బకాయిలున్న ఆరుషాపులను మునిసిపల్ రెవెన్యూఅధికారి వి.నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్య సేవలు వినియోగించుకోవాలి

రామభద్రపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవలు వినియోగించుకోవాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. శనివారం రామభద్రపురంలోని ఓ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవల విభాగాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, చింతల రామకృష్ణ, మడక తిరుపతిరావు, కర్రోతు తిరుపతిరావు, మజ్జి సిరిసహస్ర పాల్గొన్నారు.

నీటి సంఘాల ఓటర్ల జాబితా సిద్ధం

రామభద్రపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐదు సంఘాల ఓటరు జాబితా సిద్ధం చేస్తున్నామని ఇరిగేషన్ ఏఈఈ ఎన్.హరి తెలిపారు. శనివారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది రూ.4.78 కోట్లతో ఇరిగేషన్ పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు.

విద్యార్థుల సామర్థ్యంపై దృష్టి సారించాలి

వేపాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో జి.జగదీశ్వరరావు తెలిపారు.శనివారం వెల్దాం మండల పరిషత్ పాఠశాలలో వార్షికతనిఖీలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు,మరుగుదొడ్ల పరిశుభ్రతపై, తరగతి గదులు తనిఖీ చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

బొబ్బిలి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ఎస్.శివన్నారాయణ తెలిపారు. యోగాలో అండర్-14 విభాగంలో లంక జాహ్నవి, వాలీబాల్ అండర్-14 చందనపల్లి రవీనాశ్రీ, చదరంగం అండర్-17 విభాగంలో పిల్లా శాంతిలు ఎంపికైనట్లు చెప్పారు.

ఖోఖో పోటీలకు...

బొబ్బిలిలో ఏపీ గురుకుల పాఠశాలలో శనివారం ఖోఖో ఆటల పోటీలు, ఎంపిక ప్రక్రియ పీడీ నల్ల వెంకటనాయుడు ఆధ్వర్యంలో జరిగింది. ఈ మేరకు నియోజకవర్గం నుంచి 130 క్రీడాకారులు పాల్గొనగా 24 బాలురు, 24 బాలికలు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యారు. కార్య క్రమంలో పీడీ వెంకటరావు, కిషోర్, శ్రీను, అప్పలనాయుడు, కృష్ణమూర్తి, బంగారునాయుడు, లావణ్య, విజయలక్ష్మి, శశికళ, శ్రీదేవి పాల్గొన్నారు.

స్కూల్స్ గేమ్స్‌కు...

విజయనగరం క్రైం,(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 26: జిల్లా పోలీసు సంక్షేమ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న పీజే గణేష్ నవంబరు 3, 4 తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.ఈ మేరకు గణేష్‌ను శనివారం ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, ఆర్ఎస్ఐ గోపాలనాయుడు, వరప్రసాద్, ఉపాధ్యాయుడు రాజేంద్రతో పాటు పలువురు అభినందించారు.

మిగులు పనిదినాలు కల్పించాలి

బాడంగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మిగులు పనిదినాలు ఖచ్చితంగా కల్పించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ కోరారు. శనివారం బాడంగిలో ఉపాధిహామీ పథకం సిబ్బందితో ఫారం పాండ్స్, సోక్‌పిట్స్ నిర్మాణాలు, పల్లెపండుగ పనుల ప్రారంభం, గ్రామసభలు , రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీవో, సాంకేతి పాల్గొన్నారు.

జగన్ ఫొటో తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేగిడి, అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉంగరాడ గ్రామానికి చెందిన మొబైల్ డిస్పాచ్ యునిట్ (ఎండీయూ)వాహనంపై ఉన్న మాజీ సీఎం జగన్ ఫొటోను శనివారం అధికారుల ఆదేశాలతో నిర్వాహకుడు తొలగించాడు.జగన్, వైఎస్ ఫొటోల స్థానంలో పెయింటింగ్ వేశాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదునెలలు దాటినా ఉంగరాడ ఎండీయూ ఆపరేటర్ వాహనానికి జగన్, వైఎస్ చిత్రాలతోనే బియ్యం లబ్ధిదారులకు అందజేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఆంధ్రజ్యోతిలో ఇంకా జగన్ చిత్రాలతో శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. దీంతో జిల్లా సివిల్‌సప్లయిస్ అధికారులు, తహసీల్దార్ ఎల్లారావులు సీఎస్‌డీటీ రామారావు వివరణ కోరారు. దీంతో సంబంధిత ఆపరేటర్‌తో వాహనంపై ఉన్న అభ్యంతరకరమైన ఫొటోలు తొలగించే చర్యలు చేపట్టారు. ఇకపై ఎండీయూ వాహనాలపై జగన్ చిత్రాలు లేకుండా చర్యలు తీసుకొంటామని సీఎస్‌డీటీ తెలిపారు.



ఎండీయూ వాహనంపై జగన్ చిత్రాలపై పెయింటింగ్ వేసిన దృశ్యం

మరమ్మతులు లేక.. శిథిలావస్థకు చేరి

● ఇదీ మల్లయ్యపేట వద్ద నాగావళి కుడి కాలువపై వంతెన పరిస్థితి


మల్లయ్యపేట వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

సంతకవిటి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లయ్యపేట వద్ద నాగావళి కుడి కాలువపై రెండున్నర దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. నిర్మించిన తర్వాత కనీస మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఏ క్షణం కూలి పోతుందోనన్న ఆందోళన నెలకొంది. మల్లయ్యపేట నుంచి హోంజరాం, పోడలి, చిత్తారపురం, వాల్తేరు గ్రామాలకు అనుసంధానంగా ఈ వంతెన నిర్మించారు. వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు పూర్తిగా పాడయ్యాయి. దీంతో ఇక్కడ ఏ పాటి ఆదమరిచినా వాహనాలు కాలువలోకి దూసుకువెళ్లే ప్రమాదముందని చోదకులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు చీకటిపడిన తర్వాత ఈ వంతెన మీదుగా రాకపోకలకు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ వంతెన దుస్థితిని పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండాపోయిందని పలువురు వాపోతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాల ని వాహనచోదకులు, రైతులు కోరుతున్నారు.


రాజాం: సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్


కొత్తవలస: సభ్యత్వ నమోదు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


గరివిడి (మెరకముడిదాం): గర్భాంలో సభ్యత్వం తీసుకుంటున్న చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు


బొబ్బిలి: ఆన్‌లైన్‌లో పార్టీ సభ్యత్వాన్ని తీసుకుంటున్న ఎమ్మెల్యే బేబీనాయన

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

● జిల్లాలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయమని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు తెలిపారు. శనివారం జిల్లాలోని విజయనగరం, నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట, బొబ్బిలి,రాజాం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. పాత సభ్యులు రెన్యువల్ చేసుకున్నారు. రూ. వందతో సభ్యత్వం తీసుకుంటే రూ.ఐదు లక్షల ప్రమాద బీమా, విద్యవైద్య, ఉపాధి సహాయం లభిస్తాయని నాయకులు వివరించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


డెంకాడ: పినతాడివాడలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు

దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టం: కలెక్టర్

కొత్తవలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు సేవచేయడం అదృష్టమని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. శనివారం మండలంలోని మంగళపాలెంలో గల గురుదేవ చారిటబుల్ ట్రస్టు, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం సందర్శించారు. ఉప్పలపాటి ఫౌండేషన్, గురుదేవ చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా రూ.పది కోట్లతో నిర్మిస్తున్న 150 పడకల క్యాన్సర్ ఆసుపత్రి భవనాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ వ్యవస్థాపకుడు రాపర్తి జగదీష్‌బాబు ట్రస్టు కార్యకలాపాలను వివరించారు.ఇప్పటివరకు 2 లక్ష ల 50 వేల మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలతో పాటు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్స్, చెవిటి మిషను అందజేశామని తెలిపారు. దివ్యాంగులు ఉపాధికోసం వివిధ రకాల వృత్తుల్లో శిక్షణ ఇవ్వమే కాకుండా వారికి పెట్టుబడి సాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నీలకంఠరావు, ట్రస్టు వైస్ చైర్మన్ ఫణీంద్ర, ఆసుపత్రి సీఈవో రాఘవేంద్ర, ఎంపీడీవో రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


కృత్రిమ అవయవాన్ని పరిశీలిస్తున్న అంబేద్కర్

పశువుల సంతపై నివేదిక ఇవ్వండి: మంత్రి

బొండపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మానాపురం పశువుల సంతపై సంబంధిత అధికారులు సమగ్ర నివేదికను వారం రోజుల్లోగా ఇవ్వాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం బొండపల్లిలో బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీడీవోల వద్ద అన్నిశాఖలకు చెందిన పూర్తిస్థాయి సమాచారం ఉండాలన్నారు. మానాపురం సంతలో చనిపోయిన పశువులను నది పరివాహక ప్రాంతంలో పూడ్చివేస్తున్నారని పలువురు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. నది పరివాహక ప్రాంతాల్లో రక్షిత మంచినీటి బోర్లు ఎక్కువగా ఉండడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, తహసీల్దార్ డి.రాజేశ్వరరావు, గజపతినగరం, దత్తిరాజేరు ఎంపీడీవోలు జి.గిరిబాల, బి.కళ్యాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

పార్వతీపురంలో ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం

పార్వతీపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సుందర పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుందర పార్వతీపురం రూపొందించాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ ఇందులో భాగస్వాములై జిల్లా వ్యాప్తంగా పరిశుద్ధ వాతావరణం ఏర్పాటు చేయడంతోపాటు సుందరమైన ప్రకృతి సోయగల పరిసరాలను రూపకల్పనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జేసీ శోభిక, పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో జి.కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆర్ట్ గ్యాలరీని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

చెరువుల కబ్జాలపై వినతి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో గల చెరువులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు.ఈ మేరకు తహసీల్దార్ ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, కార్యవర్గసభ్యులు కోట అప్పన్న పాల్గొన్నారు.

మహిళలు రాణించాలి

రాజాం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకొని మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. శనివారం రాజాం పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)బజార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా పొదుపు మహిళలకు అనేక పథకాలతో చేయూతనిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, సుమల వెంకటమన్మథరావు, గురవాన నారాయణరావు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేస్‌కుమార్, పిన్నింటి మోహన్‌రావు, గట్టి భాను,వంగావెంకటరావు, దూబధర్మారావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీల ద్వారానే బిల్లులు చెల్లించాలి

కొత్తవలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో చేసే పనులకు పంచాయతీల ద్వారానే బిల్లులు చెల్లించాలని జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ కోరారు. శనివారం కొత్తవలసలో వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ పాగేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

● జామి,అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) పంచాయతీలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుండడంపై న్యాయపోరాటం ద్వారా ఎదుర్కొంటామని మండలంలోని 24మంది సర్పం చ్‌లు స్పష్టం చేశారు.శనివారంజామిలో ఎంపీపీ అరుణ, జడ్పీటీసీ సరయు ఆధ్వర్యంలో 24 మంది సర్పంచ్‌లు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ తీర్మానం చేసిన పనులను కాదని అధికారులు చెప్పిన పనులు ఎటువంటి అనుమతులు లేకుండా చేయడం తగదన్నారు.

రాజన్న మృతి టీడీపీకి తీరని లోటు: కోళ్ల


మాట్లాడుతున్న లలిత కుమారి

కొత్తవలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంపీపీ పొలమరశెట్టి రాజన్న మృతి టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం మంగళపాలెంలో మాజీ ఎంపీపీ, జేఎస్ఎల్ కర్మాగార టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు పొలమరశెట్టి రాజన్న మృతికి సంబంధించిన సంస్మరణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీకి పెద్ద దిక్కుగా ఉండేవారన్నారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీకి చెందిన వారైనా అందరితో అజాత శత్రువుగా మెలిగేవారన్నారు. జేఎస్ఎల్ కర్మాగార యాజమాన్య ప్రతినిధులు దినేష్ శర్మ, గోపాలకృష్ణ మాట్లాడుతూ కార్మికులు మంచి నాయకుడిని కోల్పోయారన్నారు. జేఎస్ఎల్ కార్మిక సంఘం నాయకుడు పి.అప్పలరాజు మాట్లాడుతూ కర్మాగారంలో కార్మికులు, యాజమాన్యానికి ఎంత పెద్ద సమస్య వచ్చినా చిటికలో పరిష్కరించేవారన్నారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి అప్పారావు, కోళ్ల వెంకటరమణ, కేబీబీఏ రాంప్రసాద్ కోళ్ల వెంకటరమణ, ఇందుకూరి సుధారాణి, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎంపీపీ నీలంశెట్టిగోపెమ్మ, జడ్పీటీసీ నెక్కలశ్రీదేవి, నెక్కల నాయుడుబాబు, జయప్రకాష్, కార్మికసంఘం నాయకులు పిల్లా అప్పలరాజు, కూటమి నాయకులతో పాటు, వైసీపీ నాయకులు, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో సత్తాచాటాలి

బొబ్బిలి అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాలు, సహకార ఎన్నికల్లో పార్టీ సత్తాచాటాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పిలుపునిచ్చారు. బొబ్బిలి కోటలో పార్టీ నాయకుడు అల్లాడ భాస్కరరావు అధ్యక్షతన శనివారం బొబ్బిలి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎరచూపి పార్టీ సభ్యత్వాలు నమోదు చేయవద్దని కోరారు. ప్రజల ప్రేమాభిమానాలతో స్వచ్ఛందంగా సభ్యత్వాలను తీసుకునేలా చూడాలని,బెదిరింపులు, ప్రలోభాలు వంటివి పనికిరాదన్నారు. వైసీపీ హయాంలో ఆగడాలు, అరాచకాలు వల్లే వారిని ప్రజలంతా కలిసికట్టుగా మూలకు పంపించారన్నారు. అవే తప్పులు మనం చేయకూడదన్నారు. సమావేశంలో నాయకులు రాంబార్కి శరత్‌బాబు, శ్రీనివాసరావు, గెంబలి శ్రీనివాసరావు, నర్సుపల్లి వెంకటనాయుడు,చింతల రామకృష్ణ, తెంటు రవిబాబు, కర్రోతు తిరుపతి, మడక తిరుపతినాయుడు, కింతలి శ్రీదేవి, కాకల వెంకటరావు, పరశురామ్ పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

రాజాం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసులు, రెవెన్యూబ్యాంకింగ్ సిబ్బంది, న్యాయవాదులు డిసెంబరు 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి కృష్ణ సాయి తేజతో కలిసి న్యాయవాదులు, ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామినాయుడు, ఏజీపీ పోలారావు,అప్పలనాయుడు, విజయకుమార్, సీఏనాయుడు, శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ జై భీమ్ పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేయాలి

గుర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు నిధులు విడుదల చేసి ప్రజలకు సురక్షితనీరు సరఫరా చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదికప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. శనివారం గుర్లలో అభివృద్ధి వేదిక సభ్యులతో కలిసి పర్యటించారు.కార్యక్రమంలో జేవీవీ గౌరవాధ్యక్షుడు రాజ్ వివనందకుమార్, రవికుమార్, ఎస్.లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర ఎం.శ్రీనివాస్, సీహెచ్.హరీష్‌లు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రానికి తీర్మానం చేయాలి

భామిని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు తీర్మానం చేయాలని ఎమ్మెల్సీ పి.విక్రాంత్ అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తోట శాంతి కుమారి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. మండలంలో పత్తి ఎక్కువ సాగుచేస్తుండడంతో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఎం.మోహన్‌రావు, ఎంపీటీసీ చంద్రశేఖర్ కోరారు. దీనిపై ఏవో సింహాచలం మాట్లాడుతూ రాజాంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటయ్యిందని, ఇంకో కొనుగోలు కేంద్రం అవకాశం లేద న్నారు.

ధర్నాలను జయప్రదం చేయాలి

పాలకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సి.హెచ్.సంజీవి డిమాండ్‌చేశారు. సోమవారం జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో కరపత్రాలు విడుదల చేశారు.

నేలకొరిగిన వరి పంట

మక్కువ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులకు శంబర తదితర గ్రామాల్లో వరి నేలకొరిగింది. చేతికి అందిన పంట నేలకొరగడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లో మండలంలో ఎక్కువగా వరి సాగు చేశారు. కొన్ని చోట్ల పంట కోతకు సిద్ధంగా ఉందని, గింజ కట్టే స్థితిలో చేలు పడిపోవడంతో దిగుబడి తక్కువగా వచ్చే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

న్యూస్ బాక్స్

నేడు బాడీ బిల్డింగ్ పోటీలు

విజయనగరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో ఆదివారం రాష్ట్ర స్థాయి 29వ మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కనకల కృష్ణ, వి.రమేష్ తెలిపారు. శనివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి 150మంది హాజరవుతారని చెప్పారు. సమావేశంలో శ్రీనివాస వర్మ పాల్గొన్నారు.

నేడు ఏఈవోల ధర్నా

రాజాం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :విజయనగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం ధర్నా నిర్వహించ నున్నట్లు ఏఈవోలు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.ఎరుకు నాయుడు తెలిపారు. వ్యవసాయ శాఖలో ఏఈవోలుగా పనిచేస్తున్న 20 ఏళ్లు కావస్తున్నా పదోన్నతులు కల్పించలేదని పేర్కొన్నారు.

రేపు మండల సమావేశం

వేపాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

29న ప్రభుత్వోద్యోగులకు క్రీడా పోటీలు

విజయనగరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఈనెల 29న 17 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లాక్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ఎంపికైన వారిని వచ్చే నెల 6 నుంచి 9 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 8074116276, 9177070098 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

1న విద్యార్థుల సమావేశం

విజయనగరం దాసన్నపేట, (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 26: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం దశలవారీ కార్యక్రమాల్లో భాగంగా నవంబరు ఒకటో తేదీన విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్న విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు డి.రాము, పీడీఎస్‌వో జిల్లా కన్వీనరు బి. రాకేష్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం తోటపాలెం రోడ్డులోగల ఎల్‌బీజీ భవనంలో విస్తృతస్థాయి సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు జె.రవికుమార్, సోమేష్, రమేష్, శిరీష, సోమేష్, భారతి, రాజు పాల్గొన్నారు.

11లోగా పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

విజయనగరం, కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు సంబంధించిన పరీక్ష ఫీజు ఈనెల 28 నుంచి వచ్చే నెల 11లోగా చెల్లించాలని డీఈవో మాణిక్యం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిసి రూ 125 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.రూ.50 అపరాదరుసుముతో వచ్చే నెల 18లో చెల్లించాలని, రూ.200 అపరాదరుసుంతో నవంబరు 25లోగా, రూ.500 అపరాద రుసుంతో వచ్చేనెల 30లోగా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లోని స్కూల్ లాగిన్‌లో ఫీజు చెల్లించాలని తెలిపారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ఆర్టీసీ డిపో నుంచి కార్తీక మాసం పురస్కరించుకొని నవంబరు 3, 10, 17, 24తేదీల్లో పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపోమేనేజర్ రమేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వివరాలకు 7382923679, 9490583579 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

పార్లమెంటరీ కమిటీలో కలిశెట్టికి చోటు

విజయనగరం టౌన్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు మత్స్య, పశుసంవర్ధక శాఖ సంప్రదింపులు, సలహాలు, సూచనల పార్లమెంటరీ కమిటీలో కేంద్ర ప్రభుత్వం స్థానం కల్పించింది. దేశ వ్యాప్తంగా మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ఈ కమిటీ సలహాలు, సూచనలు చేయనుంది.

ఆర్ఆర్ టీం ఏర్పాటు

గుర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుర్లలో ఇటీవల డయేరియా ప్రబలడంతో మరణాలపై విశ్లేషణ రిపోర్టు తయారు చేయడం కోసం రాపిడ్‌రెస్పాన్స్ టీమ్‌ను(ఆర్ఆర్) ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌పద్మలీల తెలిపారు. నలుగురు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్ ఉంటారని చెప్పారు.

క్రీడాకారులకు అభినందన

విజయనగరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):విజయవాడలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ ర్యాంక్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు అభినందించారు. 65 ఏళ్ల కేటగిరిలో మహేష్, సన్యాసిరాజు జోడి విజేతగా నిలవగా, 35 ఏళ్ల కేటగిరిలో మహేష్ జోడి రన్నరప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలతో పాటు టోర్నీలో ప్రతిభ కనబరిచి సెమీ ఫైనల్‌కు చేరుకున్న సౌమిత్రిని క్లబ్ క్రీడాకారులు డీఎస్పీ వెంకట అప్పారావు, రాంబాబు, మల్లిఖార్జున, శంకర్, కోచ్ ఫ్రెడ్రిక్‌లు అభినందించారు.

రాంగ్ కాల్స్

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోలేదు. ఆ కొరియర్‌ను ముంబయిలోని సీబీఐ స్వాధీనం చేసుకుందని, ఇకపై మీరు సీబీఐ దర్యాప్తు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పి ఆ వ్యక్తి కాల్ కట్ చేశాడు. వెంటనే ముంబయిలోని సీబీఐ కార్యాలయం నుంచి స్కైప్‌లో కాల్.. సీబీఐ నుంచి డీసీపీ, ఏసీపీ, ఇంకా మరికొందరు సిబ్బంది మాట్లాడారు. ఇంటరాగేషన్ పేరుతో సదరు ఉద్యోగిని ఇంట్లోనే ఉండమని చెప్పి తలుపులు మూయించి, సుమారు నాలుగు గంటలపాటు ప్రశ్నల వర్షం కురిపించారు. మనీ ల్యాండరింగ్ కేసులో ఉన్నారని, త్వరలోనే గరివిడి పోలీసులు వచ్చి మిమ్మల్ని అరెస్టు చేస్తారని బెదిరించారు. ఆ ఉద్యోగి పేరుతో ఒక నకిలీ ఆర్డర్‌ను వాట్సాప్ ద్వారా పంపించారు. ఇదంతా ఆగాలంటే సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.2లక్షలు తాము చెప్పిన ఖాతాలకు వేయాలని చెప్పారు. నేరంతో సంబంధం లేదని తేలితే, 24 గంటల్లోగా డబ్బులు తిరిగి వెనక్కి వస్తాయని నమ్మబలికారు. దీంతో ఆందోళన చెందిన ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వారు చెప్పిన ఖాతాలకు వెంటనే 1.5 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. చివరికి తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గుర్తించి లబోదిబోమని 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశారు.

● గరివిడి పట్టణంలోని మరో వ్యక్తికి గత నెల 26న గుర్తు తెలియని నంబరు నుంచి ఓ ఫోన్ కాల్ వచ్చింది. బెంగళూరులో ఉన్న తన కుమార్తె డ్రగ్స్ కేసులో దొరికిందని, ఇప్పుడు ఆమె పోలీసుల కస్టడీలో ఉందని, బెంగళూరు నుంచి ఢిల్లీ తరలిస్తున్నామని చెప్పారు. అయితే ఈ కేసు నుంచి తప్పించాలంటే రూ.2లక్షలు ఇవ్వాలని కోరారు. లంచం ఇస్తే కేసు నుంచి తప్పిస్తామని చెప్పడంతో అనుమానం వచ్చిన ఆ వ్యక్తి వెంటనే తేరుకొన్నాడు. ఆన్‌లైన్‌లో డబ్బులు పంపించడం తనకు తెలియదని, నగదుతో వస్తానని, తాను చెప్పిన ప్రదేశానికి రావాలని కోరడంతో సైబర్ కేటుగాళ్లు చేసేదేం లేక కాల్ కట్ చేశారు.

● గరివిడి మండలంలో ఓ గ్రామానికి చెందిన సర్పంచ్‌కు ఇదే తరహాలో ఫోన్ కాల్ వచ్చింది. డబ్బులు డిమాండ్ చేయడంతో తేరుకున్న ఆయన నేరగాళ్లను లైన్‌లో ఉండమని చెప్పి, తనకు మిత్రుడైన ఓ పోలీస్ అధికారికి కాల్ చేశారు. ఆ పోలీస్ అధికారి జోక్యం చేసుకోవడంతో సదరు సర్పంచ్ మోసం నుంచి బయటపడగలిగారు.

● బొబ్బిలి పట్టణంలోని ఓ ఉపాధ్యాయుడికి ఈ నెల 23న ఒక ఫోన్ కాల్ వచ్చింది. ముంబయిలోని సీబీఐ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పారు. విదేశాల్లో ఉన్న మీ కుమారుడు హవాలా ద్వారా నగదు బదిలీ చేస్తున్నాడని చెప్పి ఆయన ఆధార్ నంబరు కూడా చెప్పారు. కేసు నుంచి తప్పించాలంటే కొంత నగదు చెల్లించాలన్నారు. వాస్తవాన్ని గ్రహించిన ఉపాధ్యాయుడు ఈ సమాచారాన్ని ముందుగా స్థానిక పోలీసులకు చెప్పాలని అనడంతో కేటుగాళ్లు కాల్ కట్ చేశారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం

(5వ పేజీ తరువాయి)

ఉండేవి. ఎన్నికల సమయంలో క్లస్టర్స్‌గా విభజించి బూత్ కన్వీనర్స్, యూనిట్ ఇన్‌చార్జి, క్లస్టర్ ఇన్‌చార్జి ఇలా పలు పదవులు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను నడిపించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు.. సంస్థాగత ఎన్నికలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం కావడంతో పాత కమిటీలు రద్దయ్యే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. సభ్యత్వ నమోదు ప్రక్రియ దాదాపు రెండు నెలల సమయం ఇచ్చారు. 2025 జనవరి 18న ఎన్టీఆర్ వర్ధంతి రోజు నుంచి గ్రామ, వార్డు, డివిజన్ స్థాయి కమిటీలు పూర్తి చేసి మే నెలలో జరిగే మహానాడు నాటికి నగర, పట్టణ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిటీలు నియామకం కానున్నాయి.

తొలిరోజే భారీగా సభ్యత్వ నమోదు

విజయనగరం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం పార్టీ కార్యాలయంలో జరగ్గా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సభ్యత్వం రెన్యువల్ చేయించుకున్నారు. ఆ వెంటనే నగరంలోని 50 డివిజన్లు, మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలోని 28 గ్రామాలకు సంబంధించిన ముఖ్య నాయకులు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

● జిల్లా మెప్మా పీడీ శ్రీనివాసరావు

నెల్లిమర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా ఆర్థిక పరిపుష్టి సాధించాలని జిల్లా మెప్మా పీడీ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రామతీర్థం జంక్షన్‌లో నగర పంచాయతీ మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను కమిషనర్ కె.అప్పలరాజుతో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో తక్కువ వడ్డీతో బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నారని చెప్పారు. ఈ సొమ్ముతో ప్రతి మహిళ స్వయం ఉపాధి పథకాలు, చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీఎంఎం దన్నాన గోవిందరావు, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారిత సాధించాలి

రింగ్‌రోడ్డు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంలో అమ్మకాలు, కొనుగోళ్ల విస్తృత పరుచుకుని ఆర్థిక సాధికారతను సాధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య కోరారు. శనివారం విజయనగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ విధానంపై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓఎన్‌డీసీ నెట్‌వర్క్‌లో సులభతరంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం డీడీ మధుసూదన్‌రెడ్డి, మెప్మా ఇన్‌చార్జి శ్రీనివాసరావు, టీపీఆర్వో సింహాచలం, చాంబర్ ఆఫ్‌కామర్స్ పూర్వ అధ్యక్షుడు వెంకటాచలం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు ముచ్చు రామలింగేశ్వరరావు, శ్రీనివాసరావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి

నెల్లిమర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి పి.కూర్మినాయుడు అన్నారు. సారిపల్లి గ్రామాన్ని ఆయన శనివారం సందర్శించారు. గ్రామంలోని తాగునీరు అందించే రక్షిత మంచినీటి పథకాలను, ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించారు. జిల్లాలో డయేరియా మరణాలు సంభవించిన దృష్ట్యా ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య పరిస్థితులు చక్కదిద్దాలని, సురక్షిత తాగు నీరు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.రామకృష్ణరాజు, ఈవోపీఆర్డీ శంకర్ జగన్నాథం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆల్తిజ్యోతి, టీడీపీ నాయకుడు సారిపల్లి బాబూరావు, జనసేన నాయకుడు సారిపల్లి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మద్యం దుకాణం తరలించండి

బొబ్బిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాడంగిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణం అక్కడ నుంచి తరలించాలని ఆ గ్రామ పెద్దలు కోరారు. ఈ మేరకు శనివారం బొబ్బిలి ఎక్సైజ్ అధికారులకు సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ మరడాన రాము వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాడంగిలో స్టేట్ హైవేకు ఆనుకొని సీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయాల సమీపంలో మద్యం షాపును నిర్వహిస్తున్నారని, దీనిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

● బాడంగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బాడంగి మెయిన్ రోడ్డులో ఎస్సీ, బీసీ, బాలుర వసతి గృహాల ఎదురుగా మద్యం షాపులు ఏర్పాటుకు షాపులు లీజుకు తీసుకోవడంపై ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మరడాన గాంధీ, మాజీ వైస్ సర్పంచ్ దేవుడు రాము, బల్లి అప్పలనాయుడు, గుణుపూరు స్వామినాయుడు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలి

గరివిడి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గరివిడి రైల్వే గేటు ప్రాంతంలో అండర్ ట్రాక్ బ్రిడ్జి నిర్మించాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడుకు శనివారం వినతిపత్రం అంద జేశారు. రైల్వే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.



సాలూరు: సభ్యత్వం తీసుకుని తమ సెల్‌ఫోన్లు చూపిస్తున్న మంత్రి సంధ్యారాణి తదితరులు



కొమరాడ: మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

పండగలా టీడీపీ సభ్యత్వ నమోదు

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లాలో శనివారం పండగలా ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొని, సభ్యత్వ నమోదు చేసుకున్నారు.

● సాలూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతోనే ప్రజలకు స్వతంత్ర్యం వచ్చిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం సాలూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె లక్ష రూపాయలతో టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పాచిపెంట మండల ప్రధాన కార్యదర్శి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు. ● కొమరాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం కొమరాడ మండలం శివిని గ్రామంలో ఎమ్మెల్యే జగదీశ్వరి ప్రారంభించారు. మొదటి సభ్యత్వాన్ని తీసుకున్నారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు మహేష్, వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, దత్తి లక్ష్మణరావు, గులిపల్లి సుదర్శనరావుతో పాటు ఐదు మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● పాలకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్య క్రమం శనివారం ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ సామంతుల దామోదరరావు, టీడీపీ నాయకులు ఖండాపు వెంకటరమణమూర్తి, డాక్టర్ సీఎల్‌నాయుడు, గుమ్మడి సింహాద్రి, రమణమూర్తి, గనరి శ్రీరాములునాయుడు తది తరులు పాల్గొన్నారు. ● పాలకొండలో టీడీపీ నియోజ కవర్గ అబ్జర్వర్ కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు, పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాలకొండ: సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న భూదేవి

29న గెస్ట్ టీచర్ అభ్యర్థులకు డెమో

సీతంపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని భామిని, మెళియాపుట్టిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో గెస్ట్ టీచర్ ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 29న భామిని ఈఎంఆర్ఎస్‌లో జరిగే సర్టిఫికెట్ల పరిశీలన, డెమోకు హాజరు కావాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారి ఎటెస్టెడ్‌తో హాజరు కావాలని సూచించారు.

మెనూ పక్కాగా అమలుచేయాలి

సీతంపేట రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని డీడీ అన్నదొర ఆదేశించారు. శనివారం పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను డీడీ తనిఖీ చేశారు. విద్యార్థినుల హాజరు శాతం, ఆర్వో ప్లాంట్ పనితీరు, స్టోర్ రూంలో స్టాక్ వివరాలు పరిశీలించారు.

పీజీఆర్ఎస్‌కు కలెక్టర్

సీతంపేట రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏలో ఈ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ హాజరు కానున్నట్టు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు అందరూ సీతంపేట ఐటీడీఏలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు తప్పక హాజరు కావాలని ఆయన ఆదేశించారు.

టీకాలు వేసిన వెంటనే నమోదు చేయాలి

● డీఐవో నారాయణ

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగిడి, దుడ్డుకల్లు పీహెచ్‌సీలను, నెల్లికెక్కువ అంగన్‌వాడీ సెంటర్‌ను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) ఎం.నారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణుల వివరాలు, గడువు తేదీలను, టీకా కార్డుల్లో పరిశీలించారు. వ్యాక్సిన్ కాల పరిమితి తనిఖీ చేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు సకాలంలో టీకా వేశారా.. అని తెలుసుకున్నారు. టీకా వేసిన వెంటనే వాటిని నమోదు చేయాలని సిబ్బంది ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎదుగుదల, నమోదు రికార్డులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది గృహ సర్వేలు చేపట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్ల ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని డాక్టర్ నారాయణ సూచించారు. అనంతరం రేగిడి జీటీడబ్ల్యూఏజీహెచ్ పాఠశాలను తనిఖీ చేశారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు నీలకంఠాపురం బాలికలు



పీడీతో ఎంపికైన బాలికలు

కురుపాం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నీలకంఠాపురంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల పెదమేడపల్లిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బాలికలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ట్టు పీడీ బి.అరుణకుమారి తెలిపారు. అండర్-17 విభాగంలో పత్తిక పూర్ణమ్మ జావలిన్‌త్రో, పాలక నందిని డిస్కస్‌త్రో, బిడ్డిక రజని 800 మీటర్ల పరుగుపందెం, బిడ్డిక రోజా హేమర్‌త్రోకు ఎంపికయ్యారు. అండర్ 14వ విభాగంలో ఊయక నౌమిత డిస్కస్‌త్రోకు ఎంపికయ్యింది. వీరు నవంబరు 3, 4వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొననున్నారు. బాలికలకు హెచ్‌ఎం గిరిజారాణి, సంక్షేమాధికారిణి ప్రశాంతి అభినందనలు తెలిపారు.

వెండర్ల విధానం సరికాదు

సీతానగరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ చట్టం-2005 ప్రకారం సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం మాత్రం దానికి విరుద్ధంగా వెండర్ల విధానం తెరపైకి తేవడం సరికాదని మండల సర్పంచ్‌ల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు అత్యవసర సమావేశమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం ప్రతినిధులు వెంకటనాయుడు, తిరుపతిరావులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేపట్టిన వెండర్ (కాంట్రాక్టర్) ఎటువంటి లాభాపేక్ష లేకుండా పనులు చేస్తారా.. అని ప్రజలకు అనుమానం కలుగుతుందన్నారు.

● బలిజిపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులు చట్టబద్ధంగా జరగాలని బలిజిపేట నియోజకవర్గ సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవోకు శనివారం వినతిపత్రం అందించారు.

డీఈవోకి అభినందన

గరుగుబిల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖ అధికారిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన నల్ల తిరుపతినాయుడును మండల విద్యాశాఖ సిబ్బంది అభినందించారు. ఈ మేరకు జిల్లా కార్యాలయంలో ఎంఈవో దత్తి అప్పలనాయుడు, ఎంఈవో-2 కె.కొండలరావు ఆయన్ని కలిసి, అభినందించారు. డీఈవోను కలిసిన వారిలో సీఆర్పీ బోను రామకృష్ణ, వై.యశోధ, రాంబాబు, శంకరరావు, ఎమ్మార్సీ సిబ్బంది రమణమ్మ, వి.శారద ఉన్నారు.

న్యూస్ బాక్స్

టీడీపీకి కార్యకర్తలే బలం

విజయనగరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే బలమని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు తెలిపారు. శనివారం అండమాన్ నికోబార్ దీవుల్లో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా అండమాన్ నికోబార్ ప్రాంత అధ్యక్షుడు మాణిక్యరావు యాదవ్ ఎంపీ కలిశెట్టిని సన్మానించారు.

విజయనగరానికి పీఎం స్వానిధి అవార్డు

విజయనగరం, రింగురోడ్డు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):పీఎం స్వానిధి పథకం అమలులో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో విజయనగరం నగర పాలక సంస్థ అవార్డుకు ఎంపికైంది. న్యూఢిల్లీలోని జాయింట్ సెక్రటరీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మిషన్ డైరెక్టర్ డేఎన్ఎల్‌యూ ఆదేశాల మేరకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరక 29న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డును మునిసిపల్ కమిషనర్ అందుకోనున్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రేఖ

విజయనగరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.రేఖను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల 16 మంది సీనియర్ అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పించి నియామకాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో విశాఖలోని డాక్టర్ వీఎస్ కృష్ణ కళాశాలలో బయోటెక్ విభాగాధిపతిగా పని చేస్తున్న కె.రేఖను డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమించింది. దీంతో ఆమె శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు.

భూ ఆక్రమణను అడ్డుకోవాలి

విజయనగరం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కోర్టు వివాదంలో ఉన్న విలువైన భూఆక్రమణను అడ్డుకోవాలని టీడీపీ నాయకులు ఈగల రమణ, ఈగల సత్యారావు కోరారు. విజయనగరం మండలంలోని గొల్లలపేట రెవెన్యూ గ్రామ పరిధిలో 2.5 ఎకరాలకుపైగా భూమి వివాదంలో ఉందని, అయినా కొంత మంది వైసీపీ నాయకులు గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆన్‌లైన్‌లో తమ పేరు నమోదు చేసుకున్నారని, దీనిని అడ్డుకోవాలని తెలిపారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన రీసర్వే, భూ సమస్యల పరిష్కార గ్రామ సభలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

భూఆక్రమణపై విచారణ

రామభద్రపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆరికతోటలో భూఆక్రమణ ఫిర్యాదుపై బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు శనివారం విచారణ జరిపారు. సర్వే నెంబరు 268లో తనభూమి ఆక్రమణకు గురైందని అదే గ్రామానికి చెందినపెంకి రాధాకృష్ణ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే నాగమాధవి



బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

డెంకాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. భోగాపురం మండలం ముంజేరు గ్రామంలో తన నివాసం వద్ద శనివారం ఆమె సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. డెంకాడ మండలం బంగార్రాజుపేట గ్రామానికి చెందిన వి.అప్పలరెడ్డి గుండె సమస్య శస్త్ర చికిత్సకు రూ.58వేలు, భోగాపురం మండలం లింగాలవలస గ్రామానికి చెందిన బి.రమాదేవి కాలేయ శస్త్ర చికిత్సకు రూ.4లక్షల 68వేలు చెక్కులను అందజేశారు. జనసేన నాయకుడు పైల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో మెగా వైద్య శిబిరం

డెంకాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతలవలస వద్ద గల 5వ పోలీస్ బెటాలియన్ ఆవరణలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బెటాలియన్‌లో పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు ఈ శిబిరాన్ని నిర్వహించినట్టు చెప్పారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నెల్లిమర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సాంస్మరక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలు, కళాశాలల్లో శనివారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించినట్టు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర' అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు.